నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, సోమవారం 10 జూన్ 2024 | SURYAPET

ఐలు ఆధ్వర్యంలో జేసీజే మోడల్ పరీక్ష

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష రాస్తున్న లాయర్లు

రామగిరి, జూన్ 9 : జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను ఆదివారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బాధ్యులు మాట్లాడుతూ త్వరలో జరుగబోయే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షపై అవగాహన కల్పించి వారు విజయం సాధించేలా కృషిలో భాగంగంగానే మోడల్ టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్ష వల్ల అభ్యర్థులకు టైం మేనేజ్‌మెంట్, సబ్జెక్ట్‌పై అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల శంకరయ్య, నాయకులు పందిళ్లపల్లి బ్రహ్మచారి, డి. నర్సాజీ, లాయర్లు పాల్గొన్నారు.

'చేనేత చేయూత'కు చెల్లింపులు బంద్

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు జమ
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- ఎనిమిది నెలలుగా రూ.18 కోట్లు పెండింగ్
- సెప్టెంబర్‌తో ముగియనున్న మూడేండ్ల టర్మ్
- ఇప్పటికే చేనేత మిత్ర పథకం బంద్

నేతన్నల పొదుపు పథకానికి నిధులు నిలిపివేత

యాదాద్రి భువనగిరి, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో నేతన్నలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. నేత కార్మికులపై సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పదేండ్లపాటు సమర్థంగా అమలైన పథకాలు ఒక్కొక్కటికిగా కుంటుపడుతున్నాయి. ఇప్పటికే చేనేత మిత్ర పథకాన్ని అటకెక్కించగా.. తాజాగా చేనేతకు చేయూత స్కీమ్‌ను పెండింగ్‌లో పెట్టింది. అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా విడుదల చేయలేదు. మరో మూడు నెలల్లో టెర్మ్ పూర్తి కానుండగా సర్కారు మాత్రం పట్టించుకోవడం లేదు.

బీఆర్ఎస్ పాలనలో సమర్థంగా..

ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన నేతన్నల బతుకుల్లో స్వరాష్ట్రంలో వెలుగులు నిండాయి. నేతన్నలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటూ అండగా నిలిచింది. ఉపాధి లేక వలసలు వెళ్లిన కార్మికులకు చేయూతనిచ్చింది. ప్రత్యేకంగా అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చి ధీమా కల్పించింది. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, నేతన్నకు బీమా పథకం తదితర పథకాలను అమలు చేసి.. నేనున్నానంటూ ధైర్యాన్నిచ్చింది. గతంలో తట్టాబుట్టా చేతబట్టుకుని వలసల బాట పట్టగా.. కేసీఆర్ పాలనలో అదే కార్మికులు సొంతూర్లలో చేతినిండా పనిదొరకడంతో సంతోషంగా బతికారు.

ఎనిమిది నెలలుగా పెండింగ్..

నేతన్నలకు సామాజిక భద్రత కల్పించడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత చేయూత పథకాన్ని తీసుకొచ్చింది. నేత కార్మికుల నెలసరి చేనేత ఆదాయంలో ఎనిమిది శాతం ఆర్డి1లో జమచేసిన తర్వాత.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డి2లో 15శాతాన్ని నేరుగా జమ చేయాలి. ఆ మొత్తం నగదు వడ్డీతోపాటు మూడేండ్ల తర్వాత కార్మికులకు అందుతుంది. ఈ పథకం కింద జిల్లాలో 2017-20 సంవత్సరంలో 5,312 మంది నేతన్నలకు రూ. 37.26 కోట్లను ప్రభుత్వం తమ వాటాగా విడుదల చేసింది. ప్రస్తుత 2021-2024 సంవత్సరానికిగాను 11వేల మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డబ్బులు జమ చేయడం మరిచిపోయింది. సెప్టెంబర్ నుంచి డబ్బులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ప్రతి నెలా 2.25 కోట్లు చెల్లించాలి. ఎనిమిది నెలలుగా పెండింగ్ పడటంతో రూ.18 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోతున్నాయి. మరోవైపు కార్మికులు మాత్రం తమ వాటాను తంచనుగా కడుతున్నారు. అయితే సెప్టెంబర్‌లో స్కీం టర్మ్ ముగియనుంది. అప్పుడు ఒక్కో కార్మికుడికి రూ.లక్ష వరకు డబ్బులు జమ కానున్నాయి. బకాయిలు ఎక్కడి కక్కడ నిలిచిపోవడంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే చేనేత మిత్ర బంద్

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నేత కార్మికుల కోసం సబ్సిడీ చేనేత మిత్ర పథకాన్ని అమలు చేసింది. దీని కింద నేత కార్మికులకు రసాయనాలు, నూలుపై 40శాతం రాయితీ కల్పించింది. కొందరికి అవగాహన లేకపోవడం, సబ్సిడీ పొందే ప్రక్రియ తెలియకపోవడంతో దానిని పొందలేకపోయారు. దీని స్థానంలో మగ్గం మీద పనిచేసే ప్రతి కార్మికుడికి నెలనెలా రూ. 3వేల ఆర్థిక సాయం చేయాలని భావించింది. నేత కార్మికుల బ్యాంక్ ఖాతాలో రూ. 3వేలను జమ చేసింది. ఇందులో నేత కార్మికుడికి రూ.2వేలు, అనుబంధ కార్మికులకు వెయ్యి ఖాతాల్లో వేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పథకాన్ని బంద్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రతి నెలా 2 వేలు కడుతున్నాం..

చేనేత చేయూత పథకం కింద ప్రతినెలా 2వేల రూపాయలు బ్యాంకులో జమ చేస్తున్నాం. ఒక్క పోచంపల్లిలోనే 2,500 మంది ప్రతి నెలా త్రిఫ్ట్ డబ్బులు కడుతున్నారు. గత 8 నెలల నుంచి ప్రభుత్వ వాటా చెల్లించడం లేదు. డబ్బులు మీరు కట్టుకుంటూ వెళ్లండి.. ప్రభుత్వం డబ్బులు అవే వస్తాయి అని అధికారులు చెబుతున్నారు. 36 నెలల తర్వాత త్రిఫ్ట్ డబ్బులు మా చేతికి వస్తాయి. ఈ సారి సరైన సమయానికి ఇస్తారో లేదో చూడాలి. ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి. వస్త్రాలను కొనుగోలు చేయాలి. కార్మికులందరికీ పని కల్పించాలని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించాలి.

– కర్నాటి పురుషోత్తం, చేనేత కార్మికుడు భూదాన్‌పోచంపల్లి

ప్రతి నెలా ప్రభుత్వం త్రిఫ్ట్ డబ్బులు జమ చేయాలి

మా కుటుంబ జీవనాధారమే చేనేత పరిశ్రమ. మగ్గం నేస్తేనే వచ్చే ఆదాయంలో కొంత బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. కరోనా సమయంలో త్రిఫ్ట్ పథకం మా కుటుంబానికి ఎంతో ఆసరా అయినది. ప్రభుత్వం ప్రతినెలా త్రిఫ్ట్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలి. చేనేత పరిశ్రమ సంక్షోభంతో గిరాకీ లేక చేసేందుకు పని లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులకు అవసరం వచ్చినప్పుడు త్రిఫ్ట్ పథకంలోని డబ్బులు తీసుకునే వెసులుబాటును కల్పించాలి.

– బోడ దయానంద్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

చేనేత పథకాలను కొనసాగించాలి

గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన చేనేత త్రిఫ్ట్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించి న్యాయం చేయాలి. గత సంవత్సరం సెప్టెంబర్ వరకు ఈ పథకం కొనసాగింది. 36 నెలలు పాటు కొనసాగే ఈ పథకం ఇప్పటికీ 25 నెలలు కావస్తుంది. కార్మికులం కష్టపడి కిస్తీలు చెల్లించాం ఇప్పుడు మధ్యలో ఆగిపోతే నష్టపోతాం. మాకు చాలా వరకు చేయూతనిస్తున్న ఈ పథకాన్ని నిలిచిపోకుండా చూడాలి. మా చేనేత కార్మికుల సంక్షేమం గురించి ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగించాలి.

– గుర్రం నర్సింహ, చేనేత కార్మికుడు, చౌటుప్పల్ పట్టణం

8 నెలలుగా జమ చేయడం లేదు

చేనేత కార్మికులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత పొదుపు పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో ఒక వంతు చేనేత కార్మికుడు డబ్బులను జమ చేస్తే రెండు వంతులు ప్రభుత్వం జమ చేస్తుంది. కానీ 8నెలల నుంచి ప్రభుత్వం డబ్బులు జమ చేయడం లేదు. దాంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే పొదుపు పథకం డబ్బులను నేతన్నల ఖాతాల్లో జమ చేయాలి.

– పున్న వెంకటేశం, చేనేత కార్మికుడు, సిరిపురం, రామన్నపేట మండలం


నల్లగొండ ఎన్జీ కాలేజీలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

సజావుగా గ్రూప్-1 ప్రిలిమ్స్

- నల్లగొండ, సూర్యాపేటలో 21,350 మంది హాజరు

సూర్యాపేట ఎస్‌బీ కళాశాలలో హాల్ టిక్కెట్లు చెక్ చేస్తున్న సిబ్బంది

రామగిరి/సూర్యాపేట, జూన్ 9 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా జరిగింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎగ్జామ్ జరిగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో 47 సెంటర్లు ఏర్పాటు చేశారు. 16,899 మంది అభ్యర్థులకుగానూ 13,616 మంది హాజరయ్యారని, 3,283 మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. పరీక్ష తీరును అదనపు కలెక్టర్ పూర్ణచందర్, ఎస్పీ చందనాదీప్తి, అదనపు ఎస్పీ రాములునాయక్ వేర్వేరుగా పర్యవేక్షించారు. వీరితోపాటు జేఎన్‌టీయూ నుంచి పరీక్ష ప్రత్యేక పరిశీలకురాలు శైలజ, టీజీపీఎస్సీ నుంచి పరిశీలకుడు సతీశ్ తనిఖీలు చేశారు. ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, ఎన్జీ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి బి.నాగరాజు పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

సూర్యాపేటలో 7,734 మంది హాజరు

సూర్యాపేట జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 32 సెంటర్లను ఏర్పాటు చేశారు. 9,725 మంది అభ్యర్థులకుగానూ 7,734 మంది హాజరుకాగా 1,991 మంది గైర్హాజరయ్యారు. 79.53 శాతం హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష పత్రాలను సెంటర్లకు తరలించారు. అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు పరీక్ష పత్రాల బండిల్స్‌ను అధికారులకు అందించారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు వేయడం ప్రారంభించారు. అంధులు, దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష కేంద్రాలు కేటాయించారు. కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, అదనపు కలెక్టర్ బీఎస్ లత పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అభ్యర్థులతో సందడి

గ్రూప్ -1 పరీక్ష రాయడానికి వచ్చిన అభ్యర్థులతో జిల్లా కేంద్రాలు సందడిగా మారాయి. ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నలుమూలల నుంచి అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక బస్సులు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సూర్యాపేటలో..

నల్లగొండలో..

నల్లగొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

సూర్యాపేటలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో అభ్యర్థులను చెక్ చేస్తున్న సిబ్బంది

పరీక్షలో నల్లగొండ కవిపై ప్రశ్న

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో నల్లగొండ కవులు, రచనలపై ప్రశ్న అడిగారు. 77వ ప్రశ్నగా 'కింది వాటిలో సరైన జతను గుర్తించుము' అని అడిగిన దానిలో నల్లగొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత పున్న అంజయ్య రాసిన నీలగిరి కవుల సంచికపై వచ్చింది. దాంతో మన జిల్లా కవులు, రచయితల ఖ్యాతి మరోమారు రుజువైంది.

77. క్రింది వాటిలో సరిఅయిన జతను గుర్తించుము :
(1) సురవరం ప్రతాప రెడ్డి - గొల్కొండ పండితుల సంచిక
(2) పున్న అంజయ్య - నీలగిరి కవుల సంచిక
(3) కోదాటి నారాయణ రావు - బాల సుందరి
(4) రాళ్లపల్లి అనంత కృష్ణ శాస్త్రి - పల్లె పాటలు

యాదగిరిగుట్ట ప్రధానాలయ క్యూలైన్‌లో భక్తుల రద్దీ

యాదగిరి క్షేత్రం.. భక్త జనసంద్రం

- వేసవి సెలవులు ముగుస్తుండడంతో పెద్దఎత్తున రాక

యాదగిరిగుట్ట, జూన్9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగుస్తుండడంతో ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఎటుచూసినా భక్తులే కనిపించారు. తిరుమాడ వీధులు, క్యూ కాంప్లెక్స్, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ప్రసాద విక్రయశాలలో సందడి నెలకొన్నది. కొండపైకి వాహనాల రద్దీ సాగింది. స్వామివారి ధర్మదర్శానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నిత్య తిరుకల్యాణోత్సవంలో, ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణపుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలు, శయనోత్సవం కనుల పండువగా సాగాయి. స్వామివారిని సుమారు 65 వేల మంది భక్తులు దర్శించుకున్నారని, దేవస్థాన ఖజానాకు రూ. 83,19,056 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కొండపైన భక్తుల సందడి

హుజూర్‌నగర్‌లో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే పద్మావతి

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్, జూన్ 9 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలిసి ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రెండు నియోజకవర్గాల్లో కొత్త, పాత పనులకు రూ.124.65 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 35 రహదారుల నిర్మాణానికి రూ.267 కోట్లు, కోదాడ నియోజకవర్గంలో 7 పనులకు రూ.156 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. విద్యుత్ శాఖకు రెండు నియోజకవర్గాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ. 15 కోట్లు, నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు రూ.5 కోట్లు.. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ల నిర్మాణానికి రూ.16 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. హుజూర్‌నగర్‌లో రింగ్ రోడ్డు పనులు, టౌన్‌హాల్ , మెయిన్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న సింగిల్ బెడ్రూం ఇండ్లను మంత్రి పరిశీలించారు. డిసెంబర్ వరకు 2,160 ఇండ్లను పూర్తి చేసి అర్హులైన పేదలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఈఈ భాస్కర్‌రావు, డీఈ రమేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ రామకృష్ణ, ఈఈ వెంకటయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వులో రూ.1.5 కోట్లతో షాదీఖాన

మేళ్లచెర్వు : మండల కేంద్రంలో షాదీఖాన నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరైనట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌ను హుజూర్‌నగర్ క్రాస్ రోడ్డు వరకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్‌పీ కాల్వల మీద ఉన్న శిథిల వంతెనల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. రామాపురంలో కూడా రూ. 1 కోటితో షాదీఖాన నిర్మించనున్నట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు కొట్టె సైదేశ్వర్‌రావు, శాగంరెడ్డి గోవిందరెడ్డి, మునావర్, సైసా, మస్తాన్ పాల్గొన్నారు.

నేడు భాషా పండితులు, పీఈటీలు హాజరుకావాలి : డీఈఓ

రామగిరి, జూన్ 9 : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలు సోమవారం డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని నల్లగొండ విద్యాశాఖాధికారి బి.భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తుండటంతో తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, సర్వీస్ బుక్‌తో ఉదయం 9గంటలలోగా రావాలని పేర్కొన్నారు.

గరిడేపల్లి : కేవీకేలో మాట్లాడుతున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

దేశీ కోర్సు డీలర్లు రైతులకు సూచనలు అందించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

గరిడేపల్లి, జూన్ 9 : దేశీ కోర్సు చేస్తున్న ఉపకరణాల డీలర్లు శిక్షణలో తాము నేర్చుకున్న విషయాలను రైతులకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన 2022 - 23 దేశీ కోర్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డీలర్ల వద్దకు వచ్చే రైతులను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి తగిన మందులనే ఇవ్వాలన్నారు. అప్పుడే రైతులు సాగు చేసిన పంటల ద్వారా మంచి దిగుబడులు సాధించగలుగుతారని తెలిపారు. గడువు దాటిన మందులను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇవ్వకూడదన్నారు. రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాల గురించి రైతులకు వివరించాని చెప్పారు. అనంతరం కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ మాట్లాడుతూ 48 వారాల పాటు కేవీకేలో నేర్చుకున్న అనుభవాలను రైతులకు వివరించి, సాగు చేసిన పంటల నుంచి మంచి దిగుబడులు సాధించేలా చూడాలన్నారు. ఆ తర్వాత కోర్సు పూర్తి చేసుకున్న డీలర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశీ కోర్సు ఫెసిలిటేటర్ పి.శంకర్‌రావు, 40 మంది డీలర్లు పాల్గొన్నారు.